క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


మొక్కలు నాటుతున్న దృశ్యం

కోవెలకుంట్ల: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బిజనవేముల గ్రామ సర్పంచ్ పక్కీరమ్మ, చైల్డ్‌ఫండ్ ఇండియా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఖాదర్‌బాషా పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆ సంస్థ దత్తత గ్రామాలైన బిజనవేముల, పెద్దకొప్పెర్ల, ముదిగేడు, కమలపురిలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులు అంతరించిపోతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ కనీసం ఓ మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ప్రభావతి, సంస్థ సిబ్బంది మహేష్, మహమ్మద్ ఉసేన్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

విక్రం సారాభాయ్ జయంతి


విక్రం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : అంతరిక్ష పరిశోధన సంస్థ స్థాపనకు కృషి చేసిన విక్రం సారాభాయ్ సేవలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. పాతపేట హైస్కూల్లో శనివారం విక్రం సారాభాయ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కల్పించారు.

నివాళి


గద్దర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ప్రజా గాయకుడు భౌతికంగా లేకపోయినా ఆయన పాడిన పాటల రూపంలో ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోయారని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ధర్మారం రంగనాయకులు అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామ సచివాలయం ఎదుట శనివారం గద్దర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి కార్మికులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన గద్దర్ చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శివ, సూరి, కార్మికులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్ చిన్న మద్దమ్మ ఏకగ్రీవం



బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం గ్రామానికి చెందిన ఒకటవ వార్డు స్థానానికీ నాలుగు నామినేషన్లు వచ్చాయి. అయితే కొత్తపల్లె మదన గోపాల్, దూదిగాల్ల నర్సమ్మ, రత్నమ్మ తమ నామినేషన్లను శనివారం ఉప సంహరించుకున్నారు. దీంతో బరిలో ఉన్న కొత్తపల్లె ఎర్రమల భార్య చిన్న మద్దమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి సోమశేఖర్ ప్రకటించారు.

గుర్రం పిల్లకు వైఎస్సార్ సంచార వాహనం సేవలు


అంబులెన్స్‌లో గుర్రం పిల్లకు చికిత్సలు అందించిన దృశ్యం

డోన్ టౌన్: గుర్రం పిల్లకు దెబ్బలు తగిలి బాధపడుతుండగా డోన్ పశువుల ఆసుపత్రి అంబులెన్స్ (వైఎస్సార్ సంచార్ వాహనం) సిబ్బంది శనివారం చికిత్సలు చేశారు. పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న అమ్మ హోటల్ సర్కిల్ వద్ద ఓ గుర్రం పిల్లకు దెబ్బ తగిలిన విషయాన్ని ఓ వ్యక్తి వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవకు సమాచారం అందజేశారు. అంబులెన్స్ వాహనం అక్కడికి చేరుకుని గుర్రం పిల్లకు వెటర్నరీ డాక్టర్ సుస్మిత, సిబ్బంది శ్రీలేఖ చికిత్సలు చేశారు. మూగజీవికి వైద్యం చేసిన డాక్టర్‌తోపాటు సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టాఫీసులో జాతీయ జెండాలు

డోన్ టౌన్ : కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగ ప్రోగ్రాంలో భాగంగా ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఎగుర వేయాలనే సంకల్పంతో తక్కువ ధరలకే జాతీయ జెండాలను స్థానిక పోస్టాఫీసుల్లో అందజేస్తున్నామని బజార్ పోస్టాఫీసు మాస్టర్ రామకృష్ణ తెలిపారు. కేవలం రూ. 25 ఇస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట

- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి


వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన, జెడ్పీ చైర్మన్,


పట్టణంలో ఉర్దూ స్కూలు ను ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన, జెడ్పీచైర్మన్

బేతంచెర్ల: రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని, విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేశారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని డ్రైవర్స్ కాలనీల్లో రూ. 80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. అదేవిధంగా గొరిపేట సమీపాన 53 సెంట్లలో రూ. 29 లక్షలు వెచ్చించి నిర్మించిన ఉర్దూ స్కూల్ భవనాన్ని డీఈఓ సుధాకర్ రెడ్డి, మైనార్టీ డెవలప్‌మెంట్ అధికారి సబీయా పర్వీన్, ఎంఈఓ సోమశేఖర్ ఆధ్వర్యంలో మంత్రి, జెడ్పీ చైర్మన్, నగర పంచాయతీ చైర్మన్, ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గనను రాష్ట్ర ఉర్దూ అకాడమీ సభ్యులు మూర్తుజా వలీ, మైనార్టీ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా హుసేన్, మండల ఖాజీ నూర్ అహ్మద్ ఆధ్వర్యంలో ముస్లిం నాయకులు గజమాలతో సత్కరించారు. అనంతరం ఉర్దూ స్కూల్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. డోన్ నియోజకర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సహకారం, భగవంతుడు, ప్రజల ఆశీర్వాదంతో నలభైఏళ్లలో జరగని అభివృద్ధి నాలుగేళ్లలో చేపట్టామని, అయితే టీడీపీ నాయకులకు మాత్రం కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. ఎక్కడైనా రహదారులు దెబ్బతింటే అక్కడకెళ్లి సోషల్ మీడియాలో పెట్టి దుష్ప్రచారం చేయడం మినహా చేసేదేమీ లేదని, రూపాయ ఖర్చుపెట్టని, కనీసం కన్నెత్తి చూడని వ్యక్తులు కూడా విమర్శించడం దురదృష్టకరమన్నారు. గతంలో మైనింగ్ వ్యాపారులు దగ్గరకు వెళ్లి కట్టెలు పట్టుకుని...గన్నులతో బెదిరింపులు జరిగేవని, అలాంటి పరిస్థితుల నుంచి ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవనం సాగించేందుకు శాంతియుత వాతావరణం కల్పించామన్నారు. డోన్ నగరవనంలో నెమళ్లు తిరిగిలా అభివృద్ధి చేశామని.. ఇంకా చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ మంత్రి బుగ్గన జిల్లా అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తున్నారని, ప్రత్యేకించి డోన్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, రాజేంద్రనాథ్‌రెడ్డి, బలరామిరెడ్డి, గూని నాగరాజు, చందురెడ్డి, దస్తగిరి, వలీబాషా, ఖాజా, సలీం, కుమార్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, కంట్రాక్టర్ ఖాదర్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు శకుంతల, షేక్ ముబీనా, ఇబ్రహీం, మధు, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మీ ఆదరాభిమానాలకు ఎంత చేసినా తక్కువే...

సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యే, మంత్రి వరకు ప్రజల ఆశీర్వాదంతోనే ఎదిగానని... మా కుటుంబంపై మీరందరూ చూపుతున్న ఆదరాభిమానాలకు ఎంత చేసినా తక్కువే అని మంత్రి బుగ్గన స్పష్టం చేశారు. డోన్ నియోజవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కనుమకింది కొట్టాల వద్ద రూ. 2 కోట్లతో బిల్ల స్వర్గం గుహలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.330 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వాటర్ గ్రిడ్ పథకం కింద పనులు పూర్తి చేసి బుగ్గానిపల్లె తండాలో 8 ఎకరాల్లో నీటి ట్యాంకుల ద్వారా మరో మూడు నెలలలో ఇంటింటికీ శుద్ధమైన నీరు అందజేస్తామన్నారు. గోరుమాను కొండ గ్రామ సమీపాన రూ.36 కోట్లతో బీసీ బాలుర రెసిడెన్సియల్, రూ.8 కోట్లతో ఐటీఐ కళాశాల, రూ.4 కోట్లతో ఎంఎస్ఎమ్ టూల్ డిజైనింగ్ ఇనిస్టిట్యూట్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని గుర్తు చేశారు. సాంకేతిక విద్యను అందుబాటులోకి తేవడానికి పాలిటెక్నిక్ కళాశాలతోపాటు భవనాల నిర్మాణానికి రూ.33 కోట్లు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. బేతంచెర్ల నుంచి నాలుగు వైపులా రహదారుల నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. బేతంచెర్ల పట్టణం నుంచి వెల్దుర్తి మండలానికి రూ. 44 కోట్లతో డబుల్ రహదారి పనులు, బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలో అయ్యల చెర్వు నుంచి కస్తూర్బా గురుకుల విద్యాలయం వరకు రూ.19.20 కోట్లు, హెచ్ కొట్టాల వరకు రూ. 8 కోట్లతో నాలుగులైన్ల రహదారి పనులు జరుగుతున్నాయన్నారు. రూ.650 కోట్లతో సోమయాజులపల్లె నుంచి బేతంచెర్ల మీదుగా డోన్ పట్టణం వరకు 340(బీ) జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయని వివరించారు. అలాగే అయ్యల చెర్వులో మైనార్టీల కోసం ప్రత్యేక పార్కు ఏర్పాటు చేస్తామని, మజీద్‌ల అభివృద్ధికి, ఈద్గాలకు ప్రహరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి బుగ్గన హామీ ఇచ్చారు.

శ్రీ మద్దిలేటిస్వామికి ప్రత్యేక పూజలు

బేతంచెర్ల : మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామికి అధిక శ్రావణ శనివారం పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ, నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలివచ్చిన భక్తుల వివిధ సేవల ద్వారా రూ.2,70,175 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. అలాగే నంద్యాల పట్టణానికి చెందిన మామిడి మురళీ చంద్రుడు, సంపూర్ణమ్మ దంపతులు స్వామివారికి సాల గ్రామాలతో కూడిన వెండి మాలను సమర్పించారు. స్వామి అమ్మవార్ల పూజల అనంతరం దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు ఉచితంగా జాతీయ జెండాలు

డోన్ టౌన్ : పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయత్రం4.30గంటల నుంచి కర్రలతో సహా జాతీయ జెండాలను ఆలయ ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజినీ దంపతుల సాయంతో ప్రజలకు ఉచితంగా అందించనున్నట్లు ఆవోపా కార్యదర్శి జోన్నలగడ్డ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే త్వరలో జరగబోయే వినాయక చవితి పర్వ దినం సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలనూ అందజేస్తున్నామన్నారు. 500 మందికి వీటిని అందించనున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రంద్రాగస్టున ఇళ్లపై జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న మహిళలు

డోన్ టౌన్ : స్థానిక అమ్మవారి శాలలో శనివారం సాయంత్రం శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక శ్రావణ మాసం పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ప్రత్యేక పూజలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఏడువారాల ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పూజారులు తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


యంత్రాలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : మండల పరిధిలోని ఎద్దుపెంట గ్రామ పంచాయతీ మజరా గ్రామమైన తాడూరులో రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డులకు శనివారం వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, సర్పంచ్ బంగారు జయచంద్ర భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులకు సీసీ రోడ్ల ఆవశ్యకతపై ప్రజలు వివరించగా నిధులు విడుదలు మంజూరయ్యాయి. ఈ మేరకు సీసీ రోడ్డు నిర్మాణం పనులను చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటరాముడు, రాజు, సూర్యనారాయణ, మల్లయ్య, సురేష్, శ్రీను, ఉసేనప్ప తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయాలి


ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

కొలిమిగుండ్ల: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో భాగంగా తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయాలని తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ సూచించారు. శనివారం పెట్నికోట ఎస్సీ కాలనీలోని 15వ పోలింగ్ స్టేషన్‌తో పాటు నాయినపల్లెలో జరుగుతున్న సర్వేను పరిశీలించిన తహసీల్దార్ బీఎల్‌ఓలకు సూచనలు చేశారు. ఓటరు సర్వే ఈనెల 21 వరకు జరుగుతుందని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఫారం-6 ద్వారా దరఖాస్తు చేయించాలన్నారు. సర్వే పకడ్బందీగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

అ'పూర్వ' సమ్మేళనం


ఒకేవేదికపై చేరిన పూర్వ విద్యార్థులు

సంజామల : మండల పరిధిలోని నొస్సం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1988-89లో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఒకే వేదికపై చేరారు. ఆ ఏడాది పదవ తరగతి చదివిన 50 మంది విద్యార్థులు హైదరాబాదు, బెంగుళూరు, కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, వ్యాపారవేత్తలుగా స్థిరపడ్డారు. పూర్వ విద్యార్థులు నొస్సం గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, తిమ్మారెడ్డి, వెంకటసుబ్బయ్య, టీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చిన్ననాటి స్నేహితులు సమ్మేళనం ద్వారా కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలు, అనుభూతులు గుర్తు చేసుకున్నారు. రాబోయే రోజుల్లో పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం అప్పట్లో విద్యబోధించిన ఉపాధ్యాయులు రామిరెడ్డి, నరసింహులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాఘవయ్య, పూర్వ విద్యార్థులు శ్రీనివాసులు, ఎర్రన్న, మోహన్, బాలగంగన్న, ఓబులేసు, ప్రసన్న, రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


నొస్సం సమీపంలో పత్తిపంటలో వర్షపునీరు


అక్కంపల్లె సమీపంలో పచ్చగా మెరుస్తున్న బెండ

ఖరీఫ్.. కళకళ..!

వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఖరీఫ్ కళకళలాడుతుంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పైరు పచ్చగా మెరుస్తుంది. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ మండలాల్లో శనివారం ఉదయం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఆయా మండలాల్లో ఇప్పటి వరకు ఐదువేల హెక్టార్లలో మినుము, మొక్కజొన్న, పత్తి, పెసర, వేరుశనగ, ఆముదం, పొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు చేశారు. పైర్లు సాగు చేసి రెండు నెలలు కాగా వర్షం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో వరుణుడు కరుణించడంతో రైతులు ఊరట చెందుతున్నారు. పంటల సాగుకు ఈ నెలాఖరు వరకు అదును ఉండటంతో రైతులు సమాయత్తమవుతున్నారు. - కోవెలకుంట్ల


పుచ్చకాయలపల్లె వద్ద జనుము పైరుకు అనుకూలించిన వర్షం

మహానుభావుల అడుగు జాడల్లో నడవాలి

- ఉమ్మడి కర్నూలు జిల్లా స్పెషల్ ఆఫీసర్ రూప్‌కుమార్


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పెషల్ ఆఫీసర్

కోవెలకుంట్ల: దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన మహానుభావుల అడుగు జాడల్లో నడవాలని విజయవాడ సీఆర్‌డీ పీఆర్అండ్ఆర్‌డీ అధికారి, నా భూమి- నాదేశం కార్యక్రమ ఉమ్మడి కర్నూలు జిల్లా స్పెషల్ ఆఫీసర్ రూప్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని అమడాల, భీమునిపాడు, కోవెలకుంట్ల గ్రామాల్లో శనివారం నాభూమి- నాదేశం సదస్సులు నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ తోపాటు ఉపాధి పథకం పీడీ రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలంలోని ఆయా గ్రామాల్లో శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వారం రోజులపాటు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం అనే నినాదాలతో సదస్సులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం అమడాలలో మాజీ సైనిక ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు బాలమద్దిలేటి, ప్రదీప్, ఎంపీడీఓ రాధిక, ఏపీఓ శ్రీవిద్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అమడాల శంకరయ్య, వీరారెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశ భక్తిని చాటాలి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

సంజామల: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా దేశ భక్తిని చాటాలని ఏపీఓ ప్రకాష్ రావు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని ముక్కమల్ల, గిద్దలూరు, పేరుసోముల, రామిరెడ్డిపల్లె, కానాల గ్రామాలలో నామట్టి-నా దేశం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అదేవిధంగా శిలాఫలకాలను ఆవిష్కారించారు. నేల తల్లికి నమస్కారం, వీరులకి వందనం, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కనక రమిదేవి, అందనం శృతి, సోమసుందర్ రెడ్డి, ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచా వెంకటరామిరెడ్డి, దేశాయ్ రెడ్డి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఆటంకం కల్గిస్తే చర్యలు


పోలీసులతో కలిసి పట్టణంలో పర్యటిస్తున్న సీఐ

డోన్ టౌన్ : ప్రజా జీవనానికి ఆటంకం కల్గిస్తే ఎంతటివారైనా ఉపేక్షించమని, కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం సాయత్రం పట్టణంలో ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ పరిస్థితిని సమీక్షించారు. రోడ్డును అక్రమించి పార్కింగ్ చేసిన వాహనదారులను తీవ్రంగా హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

స్థానికంగా ఏఆర్‌టీ సేవలు

డోన్ టౌన్ : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్ఐవీ బాధ్యులకు ఏఆర్‌టీ కేంద్రం సేవలను అందిస్తున్నట్లు సూపరిడెంట్ మహ్మద్ హనీఫ్ శనివారం తెలిపారు. ఈ మేరకు ఏఆర్‌టీ ప్లస్ కేంద్రంగా 194 మందికి మందులు,162 మందికి వైరల్ లోడ్ కోసం రక్త నమూనాలు, 108మంది బాధితులకు సీడీ-4 పరీక్షలు చేశామన్నారు. అదేవిధంగా 183 మందికి ఇతర వ్యాధులు సోకకుండ హైపటైటిస్ -బి ఇంజక్షన్లు వేశామని తెలిపారు.

క్రైం కార్నర్

ఉత్తరప్రదేశ్ యువకుడి మృతి


మృతి చెందిన అఫ్జల్

కోవెలకుంట్ల: స్థానిక సంతపేటలో శనివారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ మౌలానీ అందించిన సమాచారం మేరకు.. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం గోండా జిల్లా కోలాపూర్‌ఖాజి గ్రామానికి చెందిన అఫ్జల్(27) ఉపాధి నిమిత్తం ఏడాది క్రితం కోవెలకుంట్లకు చేరుకున్నాడు. ఇక్కడ ఓ మేస్త్రి వద్ద ఇళ్లు, షాపులకు పీఓపీ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం పీఓపీ పనుల నిమిత్తం ఆటోలో ఇనుప రేకులను కిందకు దించుతుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుని తల్లి ముబిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కర్ణాటక వాసికి గాయాలు


గాయపడిన పాంచజన్య

కొలిమిగుండ్ల: నందిపాడు సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసికి గాయాలయ్యాయి. ఉడిపికి చెందిన పాంచజన్య స్నేహితుడితో కలిసి విహార యాత్రలో భాగంగా బుల్లెట్ బైక్‌పై వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు సమీపంలోని గండికోటను సందర్శించారు. బెలుం గుహల వద్ద రాత్రి బస చేసేందుకు బయలు దేరారు. మార్గమధ్యలో నందిపాడు వద్ద బైక్ పక్కకు ఆపి మూత్ర విసర్జన చేస్తుండగా అదే సమయంలో జమ్మలమడుగు వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈప్రమాదంలో పాంచజన్యకు తీవ్రగాయాలు కాగా స్నేహితుడు క్షేమంగా బయట పడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్షతగాత్రుడిని108 అంబులెన్స్‌లో తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇరువర్గాలపై కేసు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని టంగుటూరు గ్రామానికి చెందిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన ఈడిగ జాగటి ప్రసాద్, ఈడిగ జాగటి మంజులతో పాటు మరోవర్గం ఈడిగ జాగటి నడిపి సుధాకర్ భాగపరిష్కారంలో వచ్చిన ఇంటి విషయంలో ఒకరిపై ఒకరు దుర్భాషలాడుకుంటూ, గొడవ పాల్పడ్డారు. ప్రజాశాంతికి భగం కలుగిస్తుండడంతో ఇరువర్గాలపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సంజామల: మండల పరిధిలోని కానాల గ్రామంలో శనివారం పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. రైల్వే కట్ట సమీపంలో సుబ్బరాయుడు(అల్లురు), మద్దిరాల దానియేలు(లింగందిన్నె), రొక్కం చిన్న ఓబులేసు (కానాల) పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలసి దాడులు చేశామని ఎస్ఐ ప్రతాప్ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రూ.7700 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమెదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మిరపను ధ్వంసం చేసిన వ్యక్తులపై కేసు

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామానికి చెందిన వడ్ల మక్బూల్ బాషా పొలంలోకి అక్రమంగా ప్రవేశించి మిరప పైరును ధ్వంసం చేసిన అదే గ్రామానికి చెందిన మిఠాయి చాంద్ బాషా, కట్టుబడి మక్బూల్ బాషాపై శనివారం కేసు నమోదు చేశామని ఎస్ఐ ప్రతాప్ తెలిపారు. వడ్ల మక్బూల్ బాషాకు మిరపపైరు ధ్వంసం మూలంగా దాదాపు రూ.10 వేలు నష్టం వాటిల్లింది. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు.

ఎంపీటీసీ సభ్యుడి మృతి


వీరశేఖర్‌రెడ్డి (ఫైల్)

సంజామల: మండల పరిధిలోని కానాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు మద్దూరి వీరశేఖర్ రెడ్డి (48) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. పార్టీ ఆవిర్భావం నుంచి గ్రామ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. ఆయన మృతి పట్ల పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.